తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

గురువారం
05 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :



## మురుసు తుఫాన్‌కు
# దెబ్బతిన్న పంటలు

ఎర్రుపాలెం, నవంబర్ 4 (జనంసాక్షి): ఎర్రుపాలెం మండలంలో మంగళవారం కురిసిన మురుసు తుపాను ప్రభావంతో పలుచోట్ల వరి పంటలు దెబ్బ తిన్నాయి. మండలంలోని జమలాపురం. రామన్నపాలెం. ములుగుమాడు.



పలు గ్రామాల పరిధిలో గాలులతో వచ్చిన తుఫాను ప్రభావంతో వరి పంట కిందకు పడిపోయి కొన్ని వరి పొలాలు గాలివేగానికి వరిగాయి మంగళవారం పగలు రాత్రి కురి తుఫాను వర్షానికి పంటలు నష్టం జరగకపోవడంతో రైతులు పీల్చుకున్నారు.ఇప్పటివరకు సకాలంలో సరైన వర్షాలు లేక చెరువులు ఎండిపోయి పంటలకు పశువులకు కూడా నీళ్లు లేకపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్న సమయంలో ఈ వర్షం కొంతవరకు ఊరట కలిగించి మండలంలో చెరువుల లో కట్టలేరు లో జలకల ఏర్పడింది.

### భారీ వర్షాలతో భద్రాద్రి, ఖమ్మం
# జిల్లాల్లో బీభత్సం

- బేతుపల్లి చెరువులో రెండు బోట్లు బోల్తా.. 11 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతు
- సహాయక చర్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- దమ్మపేటలో మహిళను రక్షించిన సహాయక బృందాలు

వార్తా మెయిన్ పేజీలో

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు సృష్టించిన బీభత్సం, బేతుపల్లి చెరువులో రెండు బోట్లు బోల్తాపడి 11 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతైన ఘటన, సహాయక చర్యలు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు, దమ్మపేటలో మహిళను రక్షించిన ఘటనకు సంబంధించిన పూర్తి వార్తా కథనం మెయిన్ పేజీలో..



# లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉండాలి

- పోలీసు ఉద్యోగ ఆశావాహ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఒత్తిడికి గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ



కోదాడ,( జనంసాక్షి): ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత ముందస్తు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు ఉద్యోగాల ఆశావహ యువతకు ఉచిత శిక్షణ అందించడంలో

వార్తా లోపలి పేజీలో

### ప్రజల ఆర్థిక భద్రతకు భంగం కలిగిస్తే
# కఠిన చర్యలు

## అక్రమ లక్కీ డ్రాల నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం
## జిల్లా ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట జిల్లాలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రాలు, అదృష్ట పథకాలు, బహుమతుల పేరుతో డబ్బులు వసూలు చేసే కార్యక్రమాలను నిర్వహించడం చట్టవిరుద్ధమని జిల్లా ఎస్పీ కె.నరసింహా బుధవారం ప్రకటనలో హెచ్చరించారు.

వార్తా లోపలి పేజీలో

# మర్రిగూడలో ఎంపీడీవో తీరుపై సర్పంచుల ఆగ్రహం!

వార్తా లోపలి పేజీలో

# ప్రేవల్లిక కుటుంబ సీభ్యులకు న్యాయం చేయాలి: జేఏసీ డిమాండ్

- కేవలం 90 రూపాయల చిల్లర కోసం కదులుతున్న బస్సులోంచి నెట్టివేత
- పది రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూసిన మహిళా కండక్టర్
- ఆర్టీసీ సిబ్బంది రక్షణపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు.. కఠిన చర్యలకు జేఏసీ డిమాండ్

మణుగూరు, నవంబర్ 4 (జనంసాక్షి): ఆర్టీసీ కండక్టర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి బుధవారం మణుగూరు ఆర్టీసీ డిపో ఎదుట బస్సులు నిలిపివేశారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిపో నుంచి సురక్ష బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓ చిల్లర సమస్య... మనిషి జీవితం చిదిమేసింది.. రోజూ ప్రతి బస్సులోనూ, ప్రతి కండక్టర్‌కూ, ప్రయాణికుడికీ మధ్య ఎదురయ్యే అతి సాధారణ విషయం. కానీ, అదే చిల్లర గొడవ ఓ 24 ఏళ్ల యువతి ప్రాణాన్ని బలితీసుకుంటుందని ఎవరూ ఊహించలేదు. కేవలం రూ. 90 చిల్లర కోసం మానవత్వాన్ని మర్చిపోయి, ఒక మహిళా కండక్టర్‌ను

వార్తా లోపలి పేజీలో








# ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి
## కలెక్టర్ దివాకర టి ఎస్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్- 04(జనంసాక్షి ) ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు.ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మొగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. తనిఖీ రిజిస్టర్లలో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు ఉన్నారు.

జనంసాక్షి

# ప్రవల్లిక కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి: జేఏసీ డిమాండ్

కదులుతున్న బస్సులోంచి కిందకు నెట్టేయడం... ఆపై ఆమె కాలుపై నుంచే బస్సు టైర్లు వెళ్లడం... పది రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆ కన్నబిడ్డ కన్నుమూయడం... సమాజంలో నశిస్తున్న సహనానికి, వ్యవస్థలోని లోపాలకు ఒక భయానక ఉదాహరణగా నిలిచింది.తండ్రి చనిపోతే, ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా మారి, కేవలం 10 నెలల క్రితమే కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృతి ఆర్టీసీ వ్యవస్థలోని లోపాలను, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న మానసిక, శారీరక ఒత్తిళ్లను నగ్నంగా చూపిస్తోంది.

ఇది ప్రమాదం కాదు... ముమ్మాటికీ 'హత్యే'!కండక్టర్ చిల్లర ఇవ్వలేదన్న కోపంతో, కదులుతున్న బస్సు డోర్ దగ్గర ఉన్న వ్యక్తిని నెట్టేస్తే ఏమవుతుందో తెలియని అమాయకత్వం కాదు అది. ఆ క్షణంలో ప్రయాణికురాలు ప్రదర్శించిన వికృత కోపమే ప్రవళిక ప్రాణాలను తీసింది. దీనిని సాధారణ ప్రమాదంగా కాకుండా హత్య కేసుగా కింద పరిగణించి నిందితురాలికి అత్యంత కఠినమైన శిక్ష పడేలా చేయాలి. అప్పుడే ప్రభుత్వ ఉద్యోగులపై, ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న మహిళలపై చేతులెత్తడానికి ఎవరైనా భయపడతారు. ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేశారు.

**చిల్లర సమస్యకు శాశ్వత పరిష్కారం ఎక్కడ?:**

డిపోల నుంచి కండక్టర్లకు సరిపడా చిల్లర (బ్యాగ్ మనీ) ఇవ్వకపోవడం వల్ల, ప్రయాణికులతో నిత్యం ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. డిజిటల్ పేమెంట్స్ (యు పి ఐ) యుగంలో ఉన్నా, ఆర్టీసీ బస్సుల్లో ఇంకా నగదు రూపంలోనే లావాదేవీలు సాగడం, ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం ఎవరి విఫలం? ఫ్రీ బస్ లో చిల్ల ఎలా వస్తుంది.ఒకవేళ ఇద్దరు ముగ్గురు ఎక్కినా ఆన్‌లైన్ పేమెంట్ చేస్తున్నారు. కండక్టర్ కు చిల్లర ఎక్కడి నుంచి వస్తుంది.

**మహిళా సిబ్బందికి రక్షణ ఏది?:**

మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. మహిళా కండక్టర్లు ఆ రద్దీని తట్టుకుంటూ, తోపులాటల మధ్య విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కానీ, వారికి బస్సుల్లో కనీస రక్షణ కరువైంది. సిబ్బందిని దూషించినా, దాడులు చేసినా తక్షణమే ఫిర్యాదు చేసేలా లేదా వారి భద్రతను పర్యవేక్షించేలా బస్సుల్లో ఎలాంటి నిఘా సిసిటివి లు లేదా అలారమ్స్) లేదు. పైగా ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే స్పందించే ఆర్టీసీ యాజమాన్యం తమ సిబ్బంది ఫిర్యాదు చేస్తే ఎందుకు స్పందించటం లేదు 40 మంది ఎక్కాల్సిన బస్ లో 80 మంది ఎక్కితే మహిళా ఎలా విధులు నిర్వహిస్తారు. ఈ పథకం ద్వారా ఎవరు లాభ పడ్డారు ఎవరు నష్ట పోయారు..ప్రభుత్వానికే తెలియాలి..

**భవిష్యత్తుకు భరోసా ఏది?:**

ప్రవళిక మరణించిన తర్వాత ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ప్రకటించింది. కుటుంబానికి ఈ సాయం అవసరమే, కానీ పోయిన ప్రాణాన్ని ఏ ప్రభుత్వ సాయమూ తీసుకురాలేదు. రూ. 1 కోటి పరిహారం ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి మరింత భరోసా దక్కుతుంది.కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ టిడిపి బిజెపి టిఆర్ఎస్ సిపిఐ సిపిఎం వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బంది తదితరులు ప్రవళిక మృతికి సంతాపం తెలిపారు.

# ప్రజల ఆర్థిక భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

## అక్రమ లక్కీ డ్రాల నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం

## జిల్లా ఎస్పీ కె. నరసింహ



కొంతమంది వ్యక్తులు తక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తే విలువైన బహుమతులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు గెలుచుకోవచ్చంటూ ప్రజలను ఆకర్షిస్తూ లక్కీ డ్రాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వస్తోందన్నారు.ఇలాంటి పథకాల ద్వారా ప్రజలకు అధిక లాభాలు వస్తాయని నమ్మించి వారి నుంచి డబ్బులు సేకరించడం, అనంతరం బహుమతులు ఇవ్వకుండా మోసాలకు పాల్పడటం వంటి చర్యలు ప్రజల ఆర్థిక భద్రతకు తీవ్ర నష్టం కలిగిస్తాయని తెలిపారు.ప్రభుత్వ అనుమతులు, చట్టబద్ధమైన విధానాలు లేకుండా లక్కీ డ్రాలు, ప్రైజ్ చిట్స్, అదృష్ట పథకాలు నిర్వహించడం నేరమని, ఇలాంటి వ్యవహారాలపై ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, చిట్ ఫండ్స్ చట్టం, ఇతర వర్తించే చట్టాల ప్రకారం విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఇది కేవలం ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని వారి కష్టార్జిత సొమ్మును దోచుకునే సామాజిక, ఆర్థిక నేరం అని అన్నారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే ఇటువంటి అక్రమ లక్కీ డ్రాల వ్యవహారాలపై పోలీసులు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రజలకు పలు సూచనలు చేశారు.ఇలాంటి అక్రమ పథకాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 కు సమాచారం అందించాలని అన్నారు.ఇప్పటికే డబ్బులు చెల్లించి మోసపోయిన వారు పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని తెలిపారు.ప్రజల ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు అత్యాశకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అక్రమ లక్కీ డ్రా లు, అనధికారిక డబ్బుల వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మర్రిగూడ పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక మానిటర్

## ○ఫ్లోరోసిస్ బాధితుల పరిస్థితిపై సమీక్ష.. వైద్య సేవలపై ఆరా

## ○పాఠశాలల్లో సర్వేలు, గర్భిణులకు అందుతున్న సేవలపై అధికారులతో చర్చ

**మర్రిగూడ, నవంబర్ 4( జనంసాక్షి )**

జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక మానిటర్ డా. అనిమేష్ భట్టాచార్య మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో ఫ్లోరోసిస్ నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్య సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.మండల పరిధిలో నిర్వహిస్తున్న ఫ్లోరోసిస్ సర్వే వివరాలను పరిశీలించిన ఆయన.. బాధితుల కేసుల స్థితిగతులు, పాఠశాలల్లో చేపట్టిన సర్వేలు, పిల్లలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఫ్లోరోసిస్ సర్వే పురోగతితో పాటు బాధితులకు అందుతున్న చికిత్స, వైద్య సేవలపై చర్చించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, గర్భిణీ మహిళలకు అందిస్తున్న సేవలు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. మండలంలో ప్రజారోగ్య పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మర్రిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డా. షాలిని, డా. దీపక్, జిల్లా ఫ్లోరోసిస్ సంబంధిత సలహాదారు డా. ప్రవీణ్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉండాలి



భాగంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 200 మంది అభ్యర్థులకు కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఈరోజు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ అధికారుల సమక్షంలో 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యం స్పష్టంగా ఉండాలని, గమ్యాన్ని చేరుకునేందుకు మంచి ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమించాలని, పరీక్షల విషయంలో ఒత్తిడికి గురికావద్దని అన్నారు. చదవాల్సిన సబ్జెక్ట్ ఎంత ఉంది, పరీక్షకు అందుబాటులో ఉన్న సమయం ఎంత ఉందో ముందుగానే అంచనా వేసుకుని సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. పరీక్ష సమయానికి సబ్జెక్టుపై కనీసం మూడుసార్లు రివిజన్ చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహ రూపొందించిన ప్రణాళికతో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, సూర్యాపేట, తుంగతుర్తి ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు ఉద్యోగాల ఆశావహ యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. నైపుణ్యం కలిగిన అధ్యాపక బృందం, ఫిజికల్ ఈవెంట్స్‌లో అనుభవం ఉన్న పోలీసు సిబ్బందితో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ శిక్షణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అభ్యర్థులకు మంచి సబ్జెక్టుతో కూడిన 11 పుస్తకాల స్టడీ మెటీరియల్ అందించడం ద్వారా పరీక్షలకు మరింత మెరుగ్గా సిద్ధమయ్యే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ. యువత విలాసాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుకోవాలని, నిత్యం సాధన చేస్తే అసాధ్యం అనేది ఉండదని అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచి భోజన, వసతి సౌకర్యాలతో ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఒక యజ్ఞంలా కృషిచేసి ప్రతి ఒక్కరూ పోలీసు ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి గార్ల ప్రత్యేక పర్యవేక్షణతో ఎక్కువ మంది యువత పోలీసు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శిక్షణ అందించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారని అన్నారు. అభ్యర్థులకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన 200 మంది అభ్యర్థులకు కోదాడలోనే శిక్షణ ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఈ శిక్షణకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా 1,400 మందికి పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేశామని తెలిపారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందితో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని, అభ్యర్థులు పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ఉచిత శిక్షణ అభ్యర్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన..**

**పోస్టర్ ఆవిష్కరణ..**

ప్రస్తుత సాంకేతిక యుగంలో స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి ఉపయోగించుకోవాలని, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ అధికారులతో కలిసి సైబర్ సెక్యూరిటీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఇన్‌స్పెక్టర్లు రామారావు, శివకుమార్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అన్వర్, అధ్యాపకులు, శిక్షణ అందిస్తున్న పోలీసు సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.




# బెల్ట్ షాపులపై చండూరు పోలీసుల ఉక్కుపాదం

**○అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు**

**○ ఎస్సై శివకుమార్ హెచ్చరిక**

**○32 మంది పై బైండోవర్ చర్యలు**

**○17 మందిని చండూరు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచిన పోలీస్ శాఖ**

**చండూరు, నవంబర్ 4 (జనంసాక్షి)**

చండూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించడాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు నివారణ చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బెల్ట్ షాపుల నిర్వహణకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, గత రెండు రోజుల్లో మొత్తం 32 మందిపై బైండోవర్ చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎస్సై జె. శివకుమార్ వెల్లడించారు.ఇందులో భాగంగా బుధవారం నాడు మొత్తం 17 మందిని చండూరు తహసీల్దార్ మరియు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేయించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ.. చండూరు మండల పరిధిలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసినా, అనుమతి లేకుండా మద్యం విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# మాడుగులపల్లిలో యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా!

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆవేదన**

**అధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శలు**



**మాడుగులపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) :**
మాడుగులపల్లి మండల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు ఒకవైపు ప్రభుత్వం నిరుపేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడి పనులు ముందుకు సాగక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు అక్రమ వ్యాపారులు మాత్రం రోజుకు పదుల సంఖ్యలో వాహనాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం సామాన్యులకు, ఇళ్ల నిర్మాణ దారులకు ఇసుక దొరకని పరిస్థితి నెలకొనగా, అక్రమ రవాణాదారులకు మాత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా దందా సాగిపోతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి నిత్యం కన్నుల ముందే ట్రాక్టర్లు, ఇసుక తరలిపోతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమ రవాణాను అరికట్టి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తోడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, గృహ నిర్మాణ లబ్ధిదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## మొక్కలకు పెన్సింగ్ పనుల పరిశీలన

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి )**

వన మహోత్సవంలో భాగంగా మండలంలోని 365బీ హైవే నుంచి వేల్పుచర్ల గ్రామానికి రోడ్డు వెంట నాటిన మొక్కలకు జరుగుతున్న పెన్సింగ్ పనులను బుధవారం వీబీజీ రామ్ జీ అధికారులు పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీ మహేష్, టీ ఏ నాగమణి, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

# వద్దిరెడ్డిగూడెంలో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**హాజరైన గుర్రంపోడు కాంగ్రెస్ మండల నాయకులు**



**గుర్రంపోడు', నవంబర్ 04 (జనంసాక్షి)**
పేదల సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు గ్రామపంచాయతీ పరిధిలోని వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇస్లావత్ కోటి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుర్రంపోడు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ నాయకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.ఈ సందర్భంగా నూతన గృహాన్ని కాంగ్రెస్ నాయకులు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లబ్ధిదారుడు ఇస్లావత్ కోటి కుటుంబ సభ్యులకు నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ గృహప్రవేశ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు తగుళ్ల సర్వయ్య, జాల చిన్న సత్తయ్య, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మేడి వెంకన్న, నాగార్జున సాగర్ నియోజకవర్గ యూత్ జనరల్ సెక్రెటరీ కమతం జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన్ రెడ్డి లక్మా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు చందా కరుణాకర్ రెడ్డి, చందా నాగేందర్ రెడ్డి, చందా రాంరెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రాణాల మీదకు తెస్తున్న మృత్యు గోడ!

**మాడ్గులపల్లి నవంబర్ 4( జనంసాక్షి):**
అధికారుల అనాలోచిత నిర్ణయం, పర్యవేక్షణా రాహిత్యం కుక్కడం గ్రామ ప్రజల పాలిట శాపంగా మారింది జాతీయ రహదారికి ఆనుకొని అడ్డంగా నిర్మించిన ఒకే ఒక్క గోడ స్థానిక రైతులు, పాఠశాల విద్యార్థులు, వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది ఈ గోడ వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా చలనం లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రాంగ్ రూట్‌లో పయనం... ప్రాణం గుప్పిట్లో!**
కుక్కడం గ్రామానికి చెందిన రైతులు పండించిన ధాన్యాన్ని కాంటాకు (రైస్ మిల్లులు / కొనుగోలు కేంద్రాలకు) తరలించాలంటే తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు ఈ గోడ కారణంగా సరైన సర్వీస్ రోడ్డు లేకపోవడంతో, లోడు లారీలు, ట్రాక్టర్లతో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని రాంగ్ రూట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది ఎదురుగా వచ్చే వేగవంత మైన వాహనాలతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు.

**స్కూల్ పిల్లల భద్రత గాల్లో దీపం**
కుక్కడం గ్రామం నుంచి మిర్యాలగూడలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది హైవేను ఆనుకుని ఎత్తైన గోడ ఉండటంతో రహదారిపై అతివేగంగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకూ కనిపించడం లేదు దీంతో పిల్లలు రోడ్డు దాటాలంటేనే వణికిపోతున్నారు ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన తల్లిదండ్రులు తమ పనులన్నీ వదిలేసి రోజూ పిల్లలను స్వయంగా రోడ్డు దాటించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్తంభించిన డ్రైనేజీ... రోగాల బారిన జనం**
రహదారి సమస్యే కాకుండా ఈ గోడ వల్ల గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది మురుగు నీరు ముందుకు వెళ్లే మార్గం లేక నిలిచిపోవడంతో దోమల తీవ్రత పెరిగి గ్రామం రోగాల బారిన పడుతోంది.

**అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**
జాతీయ రహదారి (NH) ఆర్ అండ్ బి అధికారులకు, టోల్ ప్లాజా నిర్వహణకు పలుమార్లు పరిస్థితిని వివరించి వినతిపత్రాలు సమర్పించినా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు ఎవరైనా ప్రాణాలు కోల్పోయాక గానీ అధికారులకు కన్నుతెరుచుకోదా? అని ప్రశ్ని స్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆ ప్రమాదకరమైన గోడను తొలగించి, సక్రమమైన సర్వీస్ రోడ్డును, డ్రైనేజీ మార్గాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు లేని పక్షంలో జాతీయ రహదారిపైనే భారీ ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

**కుక్కడం దగ్గర జాతీయ రహదారిపై అనాలోచిత నిర్మాణం**
**రాంగ్ రూట్‌లో ధాన్యం లారీలు**
**చేతిలో ప్రాణాలు పెట్టుకుని స్కూల్ పిల్లల ప్రయాణం**
**డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం అధికారులు స్పందించకుంటే హైవే ముట్టడిస్తామన్న గ్రామస్థులు**



# ఇసుకబావిగూడెం ఘటన బాధితులకు మంద కృష్ణ మాదిగ భరోసా

**నిందితులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి**

**ఎఫ్ఐఆర్‌పై స్పందించకపోవడంపై ఆవేదన**



**మాడుగులపల్లి నవంబర్ 4 (జనంసాక్షి):**
గత నెలలో వినాయక చవితి ఊరేగింపు సందర్భంగా ఇసుకబావిగూడెం లో జరిగిన ఘటనపై బాధితులకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు గ్రామ ఉపసర్పంచ్ సంధ్య, ఆమె భర్త చంద్రశేఖర్‌పై భౌతిక దాడికి పాల్పడటమే కాకుండా, కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ, నిందితులపై ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో ఉపసర్పంచ్ భర్త చంద్రశేఖర్, మంద కృష్ణ మాదిగను నేరుగా కలసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

**పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన మంద కృష్ణ మాదిగ**
బాధితుల పరిస్థితిపై తక్షణమే స్పందించిన మంద కృష్ణ మాదిగ, పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు ఎఫ్ఐఆర్ నమోదై ఇన్ని రోజులైనా నిందితులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆరా తీస్తూ, బాధ్యులపై చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సందర్భంగా చంద్రశేఖర్‌తో మాట్లాడుతూ బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు మీ వెంటే ఉంటాను, మీకు అండగా నేను ఉంటాను కుల వివక్షకు వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా పోరాడాలి అని ధైర్యం చెప్పారు బాధితులకు పూర్తిస్థాయి మద్దతు అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

జనంసాక్షి

# మర్రిగూడలో ఎంపీడీవో తీరుపై సర్పంచుల ఆగ్రహం!

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలో చోటు దక్కక ఐదుగురు సర్పంచుల నిరసన
- గ్రామ పాలనలో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యమేది?
- 18 మంది కార్యదర్శుల అసంతృప్తికి తోడైన సర్పంచుల ఆవేదన
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి జోక్యంతోనే సమస్యకు పరిష్కారం?

**మర్రిగూడ,నవంబర్ 4(జనంసాక్షి)**

మర్రిగూడ మండలంలో ఎంపీడీవో మునయ్య వ్యవహారశైలిపై గ్రామపంచాయతీ సర్పంచుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలో తమకు స్థానం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం జరిగిన సమావేశంలో ఐదుగురు సర్పంచులు అభ్యంతరం తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులను సంక్షేమ పథకాల అమలులో భాగస్వామ్యం చేయకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.ఇప్పటికే మండలంలోని 18 గ్రామపంచాయతీల కార్యదర్శులు ఎంపీడీవో తీరుపై ఫిర్యాదులు చేస్తూ సామూహిక సెలవుల వినతిని సమర్పించిన నేపథ్యంలో, తాజాగా సర్పంచుల నిరసన మండల పరిపాలనలో నెలకొన్న విభేదాలను మరింత ముందుకు తెచ్చింది.

**ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో సర్పంచులను పక్కన పెట్టడమెందుకు?**

గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను గుర్తించడం, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం, అర్హుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం సర్పంచుల ప్రధాన బాధ్యతల్లో భాగం. ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉండే స్థానిక ప్రజాప్రతినిధులకు గ్రామంలోని కుటుంబాల పరిస్థితిపై అవగాహన ఉంటుంది. అలాంటి సర్పంచులను ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలో భాగస్వామ్యం చేయకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామస్థాయిలో అర్హుల గుర్తింపునకు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాల్సిన సమయంలో వారిని పక్కన పెట్టడం వల్ల ఎంపిక ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అర్హుల ఎంపికలో న్యాయం, గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై సర్పంచులు సమావేశంలో తమ అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు సమాచారం.

**అధికారుల తీరుపై పెరుగుతున్న అసంతృప్తి**

మర్రిగూడ మండలంలో కార్యదర్శులు ఇప్పటికే అధికారుల వ్యవహారశైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీల మౌలిక సదుపాయాల కోసం వ్యక్తిగతంగా ఖర్చులు చేయాల్సి వచ్చిందని కార్యదర్శులు పేర్కొంటున్నారు. గ్రామాల అవసరాల కోసం అప్పులు తెచ్చి పనులు చేపట్టినప్పటికీ, ఆర్థిక వ్యవహారాల్లో ఎదురవుతున్న సమస్యలు తమపై భారంగా మారాయని వారి వాదన. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపులు, నిధుల విడుదలకు సంబంధించిన వ్యవహారాల్లో ఒత్తిళ్లు ఎదురయ్యాయని కార్యదర్శుల వర్గం ఆరోపిస్తోంది. ఈ అంశాలపై ఎంపీడీవో మునయ్య, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. కార్యదర్శుల సమస్యలకు తోడు సర్పంచులు కూడా అధికారుల తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం మండలంలో పరిపాలనా సమన్వయంపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**గ్రామాభివృద్ధికి పనిచేసే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారా?**

గ్రామపంచాయతీల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో సర్పంచులు, కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తారు. వీరి మధ్య సమన్వయం ఉంటేనే గ్రామస్థాయి పనులు సజావుగా సాగుతాయి.అయితే అధికారుల వ్యవహారశైలిపై కార్యదర్శులు, సర్పంచులు వరుసగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఏర్పడటం గ్రామ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన వ్యవస్థలోనే విభేదాలు కొనసాగితే అభివృద్ధి పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారుతుంది.ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పరిపాలనా నిర్ణయాలు తీసుకోవడం, గ్రామాల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేయడం అధికారుల బాధ్యత.

**ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తక్షణమే స్పందించాలి**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మర్రిగూడ మండలంలో కార్యదర్శులు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.
18 గ్రామపంచాయతీల కార్యదర్శుల అసంతృప్తి, ఐదుగురు సర్పంచుల నిరసన, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీపై వివాదం నేపథ్యంలో ఎమ్మెల్యే తక్షణమే జోక్యం




చేసుకోవాల్సిన అవసరం ఉంది.మండలంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సర్పంచులు, కార్యదర్శుల సమస్యలను నేరుగా తెలుసుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై స్పష్టత తీసుకురావాలి. ఎంపీడీవో మునయ్యపై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారులతో విచారణ చేయించి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలి. గ్రామపంచాయతీల నిధుల వినియోగం, కార్యదర్శుల ఆర్థిక సమస్యలు, సర్పంచుల అభ్యంతరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి మండల పరిపాలనను సజావుగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలి.గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న కార్యదర్శులకు అండగా నిలవడం, ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు తగిన ప్రాధాన్యం కల్పించడం, సంక్షేమ పథకాల ఎంపికలో పారదర్శకతను నిర్ధారించడం ఎమ్మెల్యే ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారాయి.మర్రిగూడలో అధికారుల వ్యవహారశైలిపై పెరుగుతున్న అసంతృప్తికి పరిష్కారం చూపి, ప్రజాపాలనను గాడిలో పెట్టేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచులు, కార్యదర్శులు కోరుతున్నారు. సమావేశంలో ఐదుగురు సర్పంచులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన అంశం, కార్యదర్శుల ఆరోపణలు అందించిన సమాచారం ఆధారంగా రూపొందించబడ్డాయి. ఎంపీడీవో వివరణ, కమిటీ నియామకానికి సంబంధించిన అధికారిక వివరాలు అందుబాటులో లేవు.



# రోడ్డుపక్కన కూలిన దిశానిర్దేశక బోర్డు!

## పట్టించుకునే వారేరీ ?

### అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులకు ఇబ్బందులు

**దేవరకొండ, నవంబర్ 04 (జనంసాక్షి):**

దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ముందు కోదాడ?జడ్చర్ల జాతీయ రహదారి (167) పక్కన ఏర్పాటు చేసిన దిశానిర్దేశక బోర్డు కూలిపోయి నిరుపయోగంగా పడి ఉంది. దాదాపు మూడు నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మార్గాన్ని సూచించాల్సిన బోర్డు ఇలా రోడ్డుపక్కన పడిఉండటంతో ప్రయోజనం లేకుండా పోయింది. బోర్డుపై చెత్తాచెదారం, రాళ్లు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఉపయోగపడాల్సిన బోర్డు నెలల తరబడి నిర్లక్ష్యానికి గురవుతున్నా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలిపోయిన బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.






# వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం బాబా వారికి ఆ మంగళ స్నానం అనంతరం సుప్రభాత సేవ, కాకడ హారతి, విగ్నేశ్వర పూజ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సాయి నామ సంకీర్తన ప్రారంభించారు. 24 గంటల పాటు సాయి నామ సంకీర్తన కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని భగవంతుడు కృపకు పాత్రులయ్యారు. ఏకాహం దాతలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు పంచామృత పలరసాలతో అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, సహస్రనామ పూజలు, ఆధ్యాత్మిక సందేశాలు, సాయి సత్సంగం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. మొదటిరోజు పెద్ద ఎత్తున భక్తులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు అయ్యారు. ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ ఎంతో నిష్ఠతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షిరిడి సాయిబాబా మందిర సమితి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తీర్థ ప్రసాదాల వినియోగంతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పందిరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతల కృష్ణయ్య, కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలి

### బెల్లంకొండ సత్యనారాయణ ,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

నడిగూడెం.

ఫీల్డ్ అసిస్టెంట్ లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తారీకు నుండి 18 తారీకు వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని ప్రచారంలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లును కలిసి వారి సమస్యలను తెలుసుకున్న రైతు సంఘం, ప్రజాసంఘాల బృందం ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 47 79 జీవోని రద్దుపరిచి ఫీల్డ్ అసిస్టెంట్ లకి న్యాయం చేయాలని, గత 20 సంవత్సరాల నుండి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా సేవలందిస్తున్నారని వారిని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రచారంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం సీనియర్ నాయకులు వీరాంజనేయులు, ఎస్కే లతీఫ్ బాబు, సుధాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షులు పద్మ ,కొరట్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్, సీతారాం రెడ్డి ,ఎస్.కె మాసంబి తదితరులు పాల్గొన్నారు.



## మర్రిగూడ ఎంపీడీవో మునయ్యపై

# అవినీతి ఆరోపణల మోత!

**రూ.8.69 లక్షల ఖర్చులపై బోగస్ బిల్లుల ఫిర్యాదు**

**లేని వాహనాలకు డీజిల్.. జరగని కార్యక్రమాలకు భోజనాల ఖర్చులా?**

**ఫోర్జరీ సంతకాలతో నిధుల స్వాహా అంటూ ఎంపీటీసీ ఆరోపణ**

**డీపీఓ విచారణతోనైనా వెలుగులోకి వస్తాయా అక్రమాలు?**









**మర్రిగూడ, నవంబర్ 4 (జనంసాక్షి):**
ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత ఎక్కడ? ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిన అధికారుల ఖర్చులే ఇప్పుడు అనుమానాలకు తావిస్తున్నాయి. మర్రిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మునయ్యపై బోగస్ బిల్లులు, ఫోర్జరీ సంతకాలు, వాహనాల డీజిల్ ఖర్చులు, భోజనాల బిల్లుల పేరుతో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు, ప్రజాపాలన కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్లు, వార్డు సభ్యుల శిక్షణకు సంబంధించి రూ.8,69,569 ఖర్చులపై లెంకలపల్లి మాజీ ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం చేసిన ఫిర్యాదు మండలంలో కలకలం రేపుతోంది.

సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన బిల్లుల్లో అక్రమాలు ఉన్నాయని ఆరోపిస్తూ ఎంపీటీసీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి మంగళవారం మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చు చేసిన నిధులపై ఆరోపణలు రావడం, వాటిపై జిల్లా స్థాయి అధికారి విచారణ చేపట్టడంతో మండలంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

**ఎన్నికల ఖర్చుల పేరుతో రూ.4.18 లక్షలు!**
గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూ.4,18,169 ఖర్చు చూపించిన వ్యవహారంపై ఫిర్యాదులో పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల సమయంలో 12 బస్సులు, నాలుగు కార్లు వినియోగించినట్లు పేర్కొన్నప్పటికీ, వాహనాల వినియోగం, డీజిల్ ఖర్చులు, కిరాయి చెల్లింపులపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన 08జఇ3370 నంబరు వాహనానికి ఎన్నికల సమయంలో డీజిల్, కిరాయి, బాటా చెల్లించినట్లు బిల్లులు రూపొందించారని పేర్కొన్నారు. ఒకే చేతిరాతతో సంతకాలు చేసి, ఫోర్జరీ సంతకాలతో బిల్లులు తయారు చేశారని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన వాహనాల వివరాలు, ప్రయాణ రికార్డులు, ఇంధన కొనుగోలు బిల్లులు, చెల్లింపుల వివరాలు పరిశీలిస్తే ఈ ఆరోపణల్లోని వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**50 మందికి 1,800 టీలు.. 960 వాటర్ బాటిళ్లు!**
ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి రూ.1,98,300 ఖర్చు చూపించిన వ్యవహారం మరో వివాదంగా మారింది. 50 నుంచి 60 మంది మాత్రమే హాజరైన కార్యక్రమానికి 1,800 టీలు, 960 వాటర్ బాటిళ్లు, 590 భోజనాలు సరఫరా చేసినట్లు బిల్లులు నమోదు చేశారని ఎంపీటీసీ ఆరోపించారు.

99 రోజుల ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి సమావేశాలు నిర్వహించకుండానే భోజనాలు, తాగునీటి పేరుతో నిధులు ఖర్చు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారి సంఖ్యకు, బిల్లుల్లో చూపించిన సరఫరాలకు మధ్య వ్యత్యాసం ఉందని ఫిర్యాదుదారుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లుల్లో పేర్కొన్న సరఫరాలు నిజంగా జరిగాయా? ఎన్ని సమావేశాలు నిర్వహించారు? సరఫరాదారులకు చెల్లింపులు ఎలా జరిగాయి? అనే అంశాలు విచారణలో కీలకంగా మారాయి.

**ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రూ.39,528 పెట్రోల్ ఖర్చుల ఆరోపణ!**
ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి సంబంధించి రూ.లక్ష ఖర్చు చూపించిన వ్యవహారంపైనా ఫిర్యాదుదారుడు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. స్టేషనరీ, జిరాక్స్, డీజిల్ తదితర ఖర్చుల పేరుతో బిల్లులు రూపొందించారని ఆరోపించారు.సంబంధిత సమయంలో కారు వినియోగించకపోయినా, డీఎల్పీఓ శంకర్ నాయక్ పేరుతో ఉన్న కారుకు ఇంధన ఖర్చు చూపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.39,528 పెట్రోల్ ఖర్చు చేసినట్లు బిల్లులు రూపొందించారని ఆరోపించారు. వాహనం ఎప్పుడు, ఎక్కడ ఉపయోగించారు? ప్రయాణ వివరాలు ఏమిటి? ఇంధనం కొనుగోలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.పేదలకు ఇళ్లు కల్పించే ప్రభుత్వ పథకం పేరుతోనే ఖర్చులపై అనుమానాలు వ్యక్తమవడం చర్చకు దారితీస్తోంది.

**వార్డు సభ్యుల శిక్షణలోనూ బోగస్ బిల్లుల ఆరోపణలు!**
వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి సంబంధించి రూ.1,53,100 ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శిక్షణకు హాజరుకాని వారిని హాజరైనట్లు నమోదు చేసి, హోటల్ భోజనాల పేరుతో రూ.1,12,500 బిల్లు పెట్టారని ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం ఆరోపించారు.కార్యక్రమం నిర్వహించకుండానే ఖర్చులు చూపించారని, బోగస్ బిల్లుల ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన హాజరు పట్టికలు, భోజన సరఫరా వివరాలు, హోటల్ బిల్లులు, చెల్లింపుల రికార్డులు పరిశీలిస్తేనే ఆరోపణలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**డీపీఓ విచారణ.. ఫైళ్లలో ఏముంది?**
మర్రిగూడ ఎంపీడీవో మునయ్యపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. సంబంధిత ఫైళ్లు, బిల్లులను పరిశీలించి ఫిర్యాదుదారుడి వివరాలను నమోదు చేసుకున్నారు.
అయితే విచారణ ప్రారంభించడం మాత్రమే సరిపోదు. ప్రతి బిల్లును క్షుణ్ణంగా పరిశీలించి, ఖర్చుల వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత జిల్లా పంచాయతీ అధికారిపై ఉంది.
వాహనాల వినియోగం, ఇంధన ఖర్చులు, కార్యక్రమాల హాజరు, భోజనాల సరఫరా, సంతకాల నిజానిజాలు, చెల్లింపుల వివరాలపై సమగ్రంగా పరిశీలన జరగాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

**రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే విచారణకు అర్థమేంటి?**
అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై విచారణ జరిపేటప్పుడు రాజకీయ ప్రమేయాలు, పలుకుబడులు ప్రభావం చూపకుండా ఉండటం అత్యంత కీలకం. అధికార హోదా ఎంత పెద్దదైనా ప్రభుత్వ నిధుల వినియోగంపై ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే.
డీపీఓ తరుణ్ చక్రవర్తి విచారణలో ఏ ఒక్క అంశాన్ని కూడా తేలికగా తీసుకోకుండా, ప్రతి బిల్లును పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ జరిపితేనే ప్రజల్లో జిల్లా యంత్రాంగంపై నమ్మకం నిలుస్తుంది.
విచారణ పేరుతో కాలయాపన జరిగితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు లేకపోతే, ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలు తలెత్తడం సహజం.

**జిల్లా యంత్రాంగం స్పందించాల్సిందే!**
ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చినప్పుడు జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, బాధ్యతాయుతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను కాపాడే ప్రయత్నాలు జరిగితే అది ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.
మర్రిగూడ ఎంపీడీవోపై వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు కూడా విచారణను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. విచారణ నివేదికను పెండింగ్‌లో పెట్టకుండా, ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించి, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

**ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే!**
గ్రామపంచాయతీ ఎన్నికలు, ప్రజాపాలన కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్లు, వార్డు సభ్యుల శిక్షణకు సంబంధించిన మొత్తం రూ.8,69,569 ఖర్చులపై ఫిర్యాదులో ఆరోపణలు ఉన్నాయి. బిల్లుల్లో పేర్కొన్న ఖర్చులు నిజంగా జరిగాయా? వాహనాలు వినియోగించారా? భోజనాలు, తాగునీటి సరఫరాలు జరిగాయా? సంతకాలు ఎవరు చేశారు? అనే అంశాలు ఇప్పుడు విచారణలో కీలకంగా మారాయి.ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిధుల వినియోగంపై ఇలాంటి ఆరోపణలు రావడం పరిపాలనా వ్యవస్థకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ నిధులు ప్రజల అవసరాల కోసం కేటాయించినవే తప్ప, ఖర్చుల పేరుతో అనుమానాలకు తావిచ్చే విధంగా వ్యవహరించేందుకు కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.డీపీఓ తరుణ్ చక్రవర్తి విచారణ ఇప్పుడు జిల్లా యంత్రాంగానికి అసలైన పరీక్షగా మారింది. రాజకీయ ప్రమేయాలకు అతీతంగా వాస్తవాల ఆధారంగా విచారణ జరిపి, ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. విచారణ పేరుతో మమా అనిపించి ముగిస్తే ప్రజల్లో అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది.ప్రజాధనానికి న్యాయం జరగాలి.. ఆరోపణలపై నిజాలు బయటకు రావాలి.. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఇదే ప్రజల డిమాండ్.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ క్రాంతి కుమార్

**తుంగతుర్తి నవంబర్ 4 (జనంసాక్షి)**




సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్ది సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త పద్ధతులు అనుసరిస్తున్నారని తుంగతుర్తి ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు, బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాల పట్ల పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ మేరకు సైబర్ మోసాల పద్ధతులు, డిజిటల్ లావాదేవీలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు, గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానస్పద లింకులు, నకిలీ వెబ్సైట్లు, వాట్సప్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు, సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్ లైన్ కు సమాచార ఇవ్వాలని కోరారు, రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అపరిచితులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డు ఇతర వివరాలు తెలపవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది రాంబాబు, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డివైఎఫ్ఐ 47వ వార్షికోత్సవం: పంతంగిలో జెండా ఆవిష్కరణ

**చౌటుప్పల్ నవంబర్ 4(జనంసాక్షి )**
భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్షులు రత్నం శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానికంగా ఉన్న పరిశ్రమలలో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.అనంతరం గ్రామ శాఖ కార్యదర్శి రొడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ.. నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా, వాటికి దూరంగా ఉంటూ సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.
కులమతాలకు అతీతంగా, ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం డివైఎఫ్ఐ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. 47 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ స్ఫూర్తితో యువత అధిక సంఖ్యలో డివైఎఫ్ఐలో చేరి, యువజన సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ నాయకులు నేరేడు మహేష్, రొడ్డ శివకుమార్, నక్క లింగస్వామి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీర్క సంజీవరెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు సిద్ధగోని శ్రీకాంత్, నక్క నాగరాజు, బర్రె శశిధర్, సుక్క శ్రీకాంత్, బోయ సాయి కిరణ్, జంగం నాగేష్, రొడ్డ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ రోహిత్ రాజు

## ❑నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాలు, పెట్టుబడి మోసాలు, తెరను పంచుకునే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

## ❑"మీ డబ్బు - మీ క్లిక్ - మీ ఎంపిక" నినాదంతో నవంబర్ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు..



**కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 04 (జనంసాక్షి)**

సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టి ప్రజల్లో సురక్షితమైన డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మొత్తం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా "మీ డబ్బు – మీ క్లిక్ – మీ ఎంపిక" అనే నినాదంతో ప్రత్యేక సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతుల్లో ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాల నంబర్లు, అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే పెట్టుబడి పథకాలు, తెరను పంచుకునే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ నేరాల సహాయ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ నరేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, ఎస్సై జుబేదా బేగం, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.



# మల్కాపురంలో దూడలకు విజయవంతంగా నట్టల నివారణ కార్యక్రమం

**చౌటుప్పల్ నవంబర్ 4(జనంసాక్షి )**

చౌటుప్పల్ మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో బుధవారం ఆరు నెలల లోపు వయసు ఉన్న దూడలకు నట్టల నివారణ (డీవార్మింగ్) కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. పశువుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పశువైద్య శాఖ మరియు గ్రామ పంచాయతీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ నిరంజన్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహ హాజరై దూడలకు నట్టల నివారణ మందులను తినిపించి పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మరియు పాడిపరులు తమ దూడల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని, ఇలాంటి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చౌటుప్పల్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్న దూడలలో నట్టల సమస్య వల్ల ఎదుగుదల లోపించడం, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయని, ప్రతి మూడు నెలలకొకసారి డీవార్మింగ్ చేయించడం వల్ల దూడలు ఆరోగ్యంగా పెరుగుతాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ, వార్డు సభ్యులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, పశువైద్య సిబ్బంది మరియు గ్రామ రైతులు, పాడిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీ పథకంపై మేట్స్‌కు శిక్షణ

## కూలీలకు నిరంతర ఉపాధి కల్పించాలి.. ఎంపీడీఓ





**జనంసాక్షి నవంబర్ (04)ఆత్మకూర్ (ఎం)**

వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల మేట్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలందరికీ నిరంతరంగా ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.308 వేతనం అందేలా పనులు నిర్వహించాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 125 రోజుల పని కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేష్, ఈసీ మల్లేష్, టీఏలు శ్రీశైలం, నిర్మలతో పాటు వివిధ గ్రామాల మేట్స్ పాల్గొన్నారు.



# నీటి నిల్వ పనులకు ప్రజలు అధిక ప్రాధాన్యతనివ్వాలి

## సర్పంచ్ దున్నా శ్రీనివాస్

ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులు, ప్రజలు సహకరించాలని గ్రామ సర్పంచి దున్నా శ్రీనివాస్ కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో జల సంరక్షణ కుంట పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులు జల సంరక్షణ కుంటలు,పంట కుంటలు,నీటి కుంటలు,బోర్ వెల్ రీఛార్జి, ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి,టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు జలీల్, వెంకన్న,శ్రీలేఖ, లింగయ్య,లక్ష్మి సుజాత,కళ్యాణి,మాధవి, రజిని,విజయమ్మ పాల్గొన్నారు.

# ఎర్రజెండా సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు పోరాడిన వేగినాటి వెంకట్రావు

## ఆయన మరణం సీపీఎం పార్టీకి తీరని లోటు : జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు




**తిరుమలాయపాలెం, నవంబర్ 4( జనంసాక్షి)**

తాను నమ్మిన సిద్ధాంతం కోసం, ఎర్రజెండా ఆశయాల సాధన కోసం జీవితాంతం కృషి చేస్తూ, తుది శ్వాస వరకు పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన కమ్రేడ్ వేగినాటి వెంకట్రావు మరణం సీపీఎం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పేర్కొన్నారు. బుధవారం తిరుమలాయపాలెం మండలంలోని వెదుళ్లచెరువు గ్రామంలో నిర్వహించిన కమ్రేడ్ వేగినాటి వెంకట్రావు సంతాప సభలో నున్న నాగేశ్వరరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేగినాటి వెంకట్రావు తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు, కార్మిక, కర్షక హక్కుల సాధనకు అంకితం చేశారని కొనియాడారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తాను విశ్వసించిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి, ఎర్రజెండా నీడలో నిరంతరం ప్రజల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.

వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ, ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీ శ్రేణులకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వేగినాటి వెంకట్రావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ సంతాప సభలో సీపీఎం కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్ షేక్ బషీరుద్దీన్ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి టెంకటి వెంకటేశ్వర్లు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొప్పుల అశోక్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు టిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు పిండిప్రోలు గ్రామ ఉపసర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ భూక్య వీరభద్రం దొండేటి నిర్మల్ రావు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు తుళ్లూరు నాగేశ్వరరావు అంగిరేకుల నరసయ్య దాసరి మహేందర్ వశపొంగు వీరన్న షేక్ పత్తే అహ్మద్ సర్పంచ్ అరెంపల వినోద మండల కమిటీ సభ్యులు పుట్టల గురవయ్య శాఖ కార్యదర్శి పుల్మాని వెంకట అంగిరేకుల నరసయ్య కాంపాటి బాబురావు కొలిచలం స్వామి నెర్సుల వెంకటేష్ కాంపాటి బాబురావు దొండేటి నిర్మలరావు ఎస్కే పతే అహ్మద్ పూల పైన ముత్తయ్య దొండేటి సుగుణమ్మ మంగతాయారు తదితరులు పాల్గొన్నారునాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని కమ్రేడ్ వేగినాటి వెంకట్రావుకు ఘనంగా నివాళులర్పించారు.

## కల్లూరు మండలంలో
# తుఫాను వర్షానికి పడిపోయిన వరి పంట

- నీట మునిగి, చాపలాగా చుట్టేసిన వరి పైరు
- చేతి కందిన పంట నీటి పాలు కావడంతో
- అన్నదాతల కంట కన్నీరు

**కల్లూరు నవంబర్ 04(జనంసాక్షి)**

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వస్తే మంచి ధర పలకడంతో అప్పులు తీరుతాయని ఆశించిన రైతన్నకు మురాస్ తుఫాన్ రూపంలో వరి పంట నీట మునిగి కిందపడిపోయి తీవ్ర నష్టం కలిగించటంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. లెనీనోవా ప్రభావంతో వర్షాలు పడక సాగు చేయటానికి ఎన్నో కష్టాలు పడి అవకాశం దొరికిన దగ్గర వరి సాగు చేయడం జరిగింది. దశలవారీగా సాగుచేసిన వరిపైరు కోతకు వచ్చి కోతల ప్రారంభమైన పది రోజులకే తుఫాన్ రావడంతో రైతన్న గుండెల్లో గుబులు పుట్టింది. అయితే ఆర్నబ్ తుఫాను జల్లులతోనే ఆగిపోవడంతో రైతన్న ఊపిరి పిలుచుకున్నారు. వరిపైరు కు ఎలాంటి నష్టం జరగకుండా తుఫాన్ తేలిపోవడంతో ధైర్యంగా కోతలు మొదలుపెట్టారు .మళ్లీ వారంలోనే మరో తుఫాను మురసు రావడం మంగళవారం రాత్రి 11 నుండి బుధవారం తెల్లవారే వరకు భారీ వర్షాలు పట్టడంతో రైతన్నకల చెదిరిపోయింది. ఎక్కడ చూసినా వరి పైరు వేలాది ఎకరాల్లో కింద పడి వర్షపు నీటిలో మునిగిపోవడంతో రైతులు మనోవేదనకు గురయ్యారు. కిందపడిన వరి పైరు పై నీరు పారడంతో తీవ్ర నష్టం సంభవించింది. కింద పడిపోయిన పైరు కోత కోయాలన్న ఎకరానికి 10వేలు ఖర్చు అవుతుందని కోసిన పండిన పంట అంతా చేతికి రాదని రాలిపోయి రంగు మారి మొక్క కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి ముందుగా వేసిన వరి మంచి దిగుబడిలో వస్తున్నాయని 35 నుంచి 45 వరకు 77 కేజీలు బస్తాలవుతుందని రైతులు ఆనందపడ్డారు .తుఫాన్ రూపంలో ఆశలు ఆవిరైపోయిని రైతన్నలు కంటతడి పెడుతున్నారు. గింజ పోసుకునే వరి పైరు కూడా కింద పడిపోవడంతో గింజ పాలు పోసుకోకుండా తాలుగామరే పరిస్థితి ఉందనికోత కూలీ కూడా వస్తుందో రాదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో ఎర్రబోయినపల్లి యజ్ఞ నారాయణపురం చెన్నూరు, ముచ్చవరం, పుల్లయ్య బంజర బత్తులపల్లి, కప్పల బంధం, పడమర లోకవరం, తూర్పు లోకవరం, పేరువంచ, కిష్టయ్య బంజారా, కల్లూరు, ఎర్ర బంజర తదితర గ్రామాల్లో




ఎక్కువగా పంట నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో మండలం మొత్తం మీద 33,000 ఎకరాల్లో వరి సాగు చేయడం జరిగింది . కనీసం 8,000 ఎకరాలపైగా కింద పడిపోయి నీట మునిగిందని రైతులు అంటున్నారు. ఇప్పుడిప్పుడే కోతలు ముమ్మరం అవుతుండగా తుఫాన్ రూపంలో తమకు తీరని నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతుల కోరుతున్నారు. మండలంలో తుఫాను ప్రభావంతో నేలవాలి,నీట మునిగిన పంట పొలాలను, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ మాదాబత్తుల రూప పలు గ్రామాల్లో పర్యటించి సందర్శించారు. సుమారుగా 4800 ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగినట్లు తెలిపారు. తుఫాను దాటికి పొంగిపొర్లుతున్న వాగులు వంకలు, అలుగులు పారుతున్న చెరువులు కుంటలు సమీపంలోని వరి పంట పొలాలు ఎక్కువ శాతం నీట మునిగిపోయాయని తెలిపారు .

## భారీ వర్షాల నేపథ్యంలో
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు బీఆర్ఎస్ నేతల సూచన**

**భద్రాచలం నవంబర్ 4 (జనంసాక్షి)**

భద్రాచలం నియోజకవర్గ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రాణ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, సీనియర్ నాయకుడు మానే రామకృష్ణ సూచించారు.భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహించే ప్రమాదం ఉందని, అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని వారు కోరారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలను దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసేందుకు సాహసించవద్దని హెచ్చరించారు. వర్షాల పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించాలని వారు కోరారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటూ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

# "మురుసు" ప్రభావంతో
# పారుతున్న రాతోనిచెరువు అలుగు

పెనుబల్లి,నవంబర్ 4( జసం సాక్షి )

మురుసు తుఫాన్ కు భారీగా వరద నీరు చేరడంతో పెనుబల్లి రాతోనిచెరువు అలుగు పారుతుంది. మంగళవారం కురిసిన వర్షానికిచెరువునిండి అలుగు పారడంతో పెనుబల్లి గ్రామ రాతోని ఆయకట్టు రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది రాతోని ఆయకట్టు కింద సుమారు 2500 ఎకరాలు సాగు అవుతుండగా ఈ ఏడాది ఎలినినో ప్రభావం వల్ల సుమారు 15వందల ఎకరాలు మాత్రమే సాగు చేసిన వరి పంట కోతకు వచ్చిన సమయంలో మురుసు తుఫానుకు పంట నీటిమయం కావడంతో ఆయకట్టు రైతులు ఆందోళనలో ఉన్నారు. తొలకరిలో వరి సాగు కి సాగునీరు ఇబ్బంది కాక ఇప్పుడు వరికోతల సమయంలో వరదలు ముంచెత్తాయి.



# డ్రైనేజీల పూడికతీత
# వేగవంతం చేయాలి: మేయర్

**లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేషన్ మేయర్ మూడ్. గణేష్**

**కొత్తగూడెం పట్టణం నవంబర్ 4 జనంసాక్షి**

ఈరోజు కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ముంపు ప్రాంతాల్లో మేయర్ పర్యటించి ముంపు సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రధాన, అంతర్గత రహదారులపై నిలిచే మోకాళ్ళలోతు నీటిని సమీప మురుగు కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. వరద నీరు వెనక్కి తన్నకుండా, ఆవాసాల్లోకి చేరకుండా అదనపు మోటార్లతో నీటిని తోడివేయాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. డ్రైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీలతో తక్షణమే తొలగించి పూడికతీత పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిని విడిచి వెళ్లరాదని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వేళ విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, దోమల మందు పిచికారీ పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్‌ను సమన్వయం చేసుకుంటూ, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు పడే నగరవాసులకు ప్రతి డివిజన్‌లోనూ సత్వర సహాయం అందించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, డిప్యూటీ మేయర్ లలిత, కార్పొరేటర్ జివిఆర్, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో
# ఏకాదశి కార్యక్రమాలు

**ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 4 (జనంసాక్షి)**

ఖమ్మం బ్రాహ్మణ బజార్ శ్రీబునీల సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నేడు ( గురువారం )ఏకాదశి సందర్భంగా సాయం కాలం విష్ణు సహస్రనామాల సంకీర్తన, ఊంజల సేవ కార్యక్రమం జరుగనున్నందువల్ల , భక్తులు విశేషంగా పాల్గొనాలని, స్వామి ఆశీస్సులు పొందాలని, ఈ ఏకాదశి కార్యక్రమాలలో, పద్మనాభం, ప్రమీల, శ్రీను, ఉషా, హనుమంతరావు, రాజ్యలక్ష్మి, రమేష్ బాబు, ప్రసన్న లక్ష్మి, లతోపాటుగా ప్రతీ ఏకాదశి నాడు సహస్రదీపాలంకరణ సేవలో లాయర్ రంగారావు, ప్రభావత్ పాల్గొంటున్నారని , అధిక సంఖ్యలో భక్తులు వచ్చి విష్ణు సహస్రనామాలు చదివి పాటలు పాడి తీర్థ ప్రసాద ములు తీసుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని, యధావిధిగా ఆలయ అర్చకులు శేషు కుమార్, శ్రీనివాస చార్యుల సేవలు కొనసాగనున్నాయని, కార్యనిర్వహకురాలు సరోజినీ అమ్మ ప్రకటించారు.

# ఈ నెల 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలు?

## ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

**ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 4( జనంసాక్షి )**

విద్యార్థులలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించడం, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువతను భాగ స్వాములను చేయడమే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, జిల్లా విద్యాశాఖ సహకారం తో ఈ నెల 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నషా ముక్త్ భారత్, తెలంగాణ రైజింగ్-2047 కార్యక్రమాలలో భాగంగా నవంబర్ 13, 2026 (శుక్రవారం) నాడు నాయుడుపేట సర్కిల్ సమీపంలోని టీసీవీ కల్యాణ మండపంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని డిప్యూటీ కమిషనర్ అన్నారు. విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం, చరిత్ర, సంస్కృతి, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ నుండి గరిష్ఠంగా రెండు జట్లు (ఒక్కో జట్టుకు ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు విద్యార్థులు) పాల్గొనవచ్చని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని స్పష్టం చేశారు. ఈ క్విజ్ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో నిర్వహిస్తారని, నషా ముక్త్ భారత్, భారత చరిత్ర-సాంస్కృతిక వారసత్వం, తెలంగాణ చరిత్ర-సాంస్కృతిక వారసత్వం మరియు సమకాలీన (కరెంట్ అఫైర్స్) అంశాలపై ప్రశ్నలు ఉంటాయని వివరించారు. మొదట 20 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో రాత పరీక్ష నిర్వహించి, టాప్ 12 జట్లను సెమీఫైనల్స్‌కు, ఆపై ప్రతిభ చూపిన 6 జట్లను గ్రాండ్ ఫైనల్స్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. ఫైనల్స్‌లో ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా ఆరు విభాగాల్లో దృశ్య, శ్రవణ (ఆడియో/వీడియో) మాధ్యమాల్లో క్విజ్ ఉంటుందని, విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని చెప్పారు.పోటీల్లో పాల్గొనగోరు విద్యాసంస్థలు నవంబర్ 10వ తేదీలోగా గూగుల్ ఫామ్ / క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. పాల్గొనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.మరిన్ని వివరాలు లేదా సందేహాల కోసం ఖమ్మం-ఎ టౌన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. చిరంజీవి (8712648841), ఖమ్మం-ఎఎ టౌన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. రాజు (8712648842), లేదా కిషోర్ రెడ్డి (95339 98674) లను సంప్రదించాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వర్షపు నీటిలో మునిగిన ఇల్లు

**○ఇద్దరు చిన్నారులతో తల్లికి తప్పని తిప్పలు.. భయాందోళనలో కుటుంబం**

**○తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకోలు**



**అన్నపురెడ్డిపల్లి నవంబర్ 4 జనంసాక్షి**

మండలంలో మురుసు తుపాను ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు మర్రిగూడెం గ్రామంలో శనగరపు వెంకటేశ్వర్లు నివాస గృహం నీట మునిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి వర్షం తీవ్రత పెరగడంతో ఇంట్లోకి భారీగా వర్షపు నీరు చేరింది.దీంతో ఇద్దరు చిన్నారులతో పాటు వారి తల్లి తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కుటుంబ సభ్యులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయాందోళన మధ్య గడుపుతున్నారు.ఇప్పటికైనా



సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి తమ నివాస గృహాన్ని పరిశీలించాలని, వర్షపు నీటితో కలిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన న్యాయం చేయాలని బాధిత కుటుంబం ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.



## లంకా సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన ఎం ఎల్ ఏ రాగమయి

**పెనుబల్లి నవంబర్ 4 (జనంసాక్షి)**

మురుసు తుపాన్ ప్రభావంతో పెనుబల్లి మండలంలో కురిసిన బా రివర్షాలకు చెరువులు కుంటలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో మేజర్ ప్రాజెక్ట్ అయిన లంకా సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నీటిమట్టం పెరిగి అలుగు పడింది, ఈ సందర్భంగా సత్తుపల్లి ఎం ఎల్ ఏ డాక్టర్ మట్టా రాగమయి ప్రాజెక్టుని పరిశీలించారు.



# కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో బహిరంగ వేలం

**పూజా సామగ్రి, కొబ్బరికాయలు, లడ్డూ ప్రసాదం విక్రయ హక్కుల కేటాయింపు**

**అన్నపురెడ్డిపల్లి నవంబర్ 4 జనంసాక్షి**

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అన్నపురెడ్డిపల్లి లో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పి.వి. రమణ తెలిపారు. ఈరోజు ఉదయం 10:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.కార్తీక మాసం నెల రోజుల పాటు భక్తులకు అవసరమైన పూజా సామగ్రి విక్రయం, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, లడ్డూ ప్రసాదం విక్రయ హక్కులను బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్ణీత సమయానికి దేవస్థానానికి చేరుకోవాలని కోరారు. వేలం ప్రక్రియలో ఆలయ నిబంధనలు, విధివిధానాలను పాటిస్తూ పారదర్శకంగా జరిగే కార్యక్రమానికి సహకరించాలని సూచించారు. కార్తీక మాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో భాగంగానే ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ తెలిపారు. స్వామివారి సేవలో భాగస్వాములు కావాలని భక్తులకు, ఆసక్తి కలిగిన వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా స్వర్గీయ పల్లా జాన్ రాములు జయంతి

**ఉచిత జనరల్ వైద్య శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం**

**ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 4 జనంసాక్షి**

పేదల పక్షపాతి, స్వర్గీయ పల్లా జాన్ రాములు జయంతి సందర్భంగా వారి కుమారుడు ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత జనరల్ వైద్య శిబిరం మరియు ఉచిత జనరల్ కంటి వైద్య శిబిరాన్ని రెవ.కె.సేనం రాజు (బిషప్ డోర్నకల్) చేతుల మీదిగా ప్రారంభించం జరిగింది.స్థానిక మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో పల్లా జాన్ రాములు జయంతి సందర్భంగా వారి కుమారుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత జనరల్ వైద్య శిబిరం మరియు ఉచిత జనరల్ కంటి వైద్య శిబిరం భారీ సక్సెస్ అయింది.ఈ వైద్య శిబిరానికి సుమారు 1000 మందికి పైగా నిరుపేద ప్రజలు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా వైద్యం చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవడం జరిగింది.

సుమారు 300 మంది పైగా నిరుపేద ప్రజలకు ఉచిత కళ్ళజోళ్ళు అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని .రెవ.డా.కె.సేనం రాజు (బిషప్ డోర్నకల్) గారు ప్రారంభించి, పెద్దలు ప్రముఖులు ప్రజలు స్వర్గీయ పల్లా జాన్ రాములు ని మరియు పల్లా కిరణ్ సేవలను కొనియాడారు. బిషప్ తో పాటు, రెవ.డాక్టర్ విశ్వం,మిస్టర్ జి ప్రభాకర్ రావు, రెవ.బి. శ్రీనివాస్ పాల్, రెవ.ఇశ్రాల్ రెడ్డి, ఎల్లయ్య (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్), చిల కబత్తిని కనకయ్య పాల్గొని ఆశీర్వదించారు డా.రఘు, డా.సృజన్, డా.రాజు కుమార్, డా.హరికృష్ణ, గంట కిరణ్ మరియు పల్లా కిరణ్ యూత్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట, కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ మరియు పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు, నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక మరియు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో సొంత ఖర్చుతో బోర్లు ఏర్పాటు మరియు ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా. వృద్ధులకు, వికలాంగులకు, మహిళ లకు, అనాథ బాలబాలికలకు మరియు యువత కు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు.



## శిథిలావస్థలోని ప్రహరీ గోడ కూలి ఆస్తి నష్టం

**ప్రమాదకరంగా ఉన్న మిగిలిన గోడను తొలగించాలని వినతి**

**భద్రాచలం నవంబర్ 04 (జనంసాక్షి)**

భద్రాచలం సుభాష్ నగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాత ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. మిగిలిన గోడ కూడా ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కొంతభాగం కూలిపోయిన గోడను పూర్తిగా తొలగించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గోడ సమీపంలో నివసించే వారి ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న పాత ప్రహరీ గోడను పూర్తిగా తొలగించి, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు



తీసుకోవాలని కోరుతూ భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణకు బాధిత కుటుంబ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## నల్లగొండ రైతు మహాసభకు ఇంటికో మనిషి తరలిరావాలి

**సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ పిలుపు**

**భద్రాచలం నవంబర్ 04 (జనంసాక్షి)** రైతుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే అఖిల భారత రైతు సంఘం మహాసభల బహిరంగ సభకు ఇంటికో మనిషి తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. బుధవారం భద్రాచలంలో ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఏజే రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి రైతు మహాసభలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహాసభల సందర్భంగా నిర్వహించే రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతులో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, డి.సీతాలక్ష్మి, ఎన్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లా జాన్ రాములు జయంతి వేళ ఘనంగా ఉచిత వైద్య శిబిరం

- వర్షాన్ని సైతం లెక్కచేయక తరలివచ్చిన వెయ్యి మంది పేదలు
- డోర్నకల్ బిషప్ డాక్టర్ కె. సేనం రాజు చేతుల మీదుగా ప్రారంభం
- 300 మందికి పైగా ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



**ఖమ్మం, నవంబరు 4 (జనంసాక్షి):**
పేదల పక్షపాతి, పీడిత ప్రజల హక్కుల పోరాట యోధుడు స్వర్గీయ పల్లా జాన్ రాములు 88వ జయంతి సందర్భంగా ఖమ్మం మిషన్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత జనరల్ మరియు కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయన కుమారుడు, ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహా శిబిరాన్ని డోర్నకల్ డయోసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ కె. సేనం రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 1,000 మందికి పైగా నిరుపేదలు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు, కంటి సమస్యలతో బాధపడుతున్న 300 మందికి పైగా బాధితులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ కె. సేనం రాజు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం అంకితమైన పల్లా జాన్ రాములు ఆశయాలను ఆయన తనయుడు పల్లా కిరణ్ సేవా కార్యక్రమాల ద్వారా సజీవంగా నిలబెడుతున్నారని కొనియాడారు. పేదలకు ఆరోగ్యాన్ని, చూపును ప్రసాదించే ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినంద నీయమన్నారు.

**20 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ: పల్లా కిరణ్**
నిర్వాహకుడు పల్లా కిరణ్ మాట్లాడుతూ.. తన తండ్రి చూపిన బాటలోనే గత రెండు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రెండుసార్లు మెగా వైద్య శిబిరాల నిర్వహణ, కరోనా విపత్కర కాలంలో మూడు వేల కుటుంబాలకు నిత్యావసరాలు, పచ్చళ్ల పంపిణీ, ఉపాధి కోల్పోయిన ప్రైవేటు ఉపాధ్యాయులకు బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వరదల సమయంలో బాధితులకు అండగా నిలవడం, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సొంత ఖర్చుతో బోర్లు వేయించి ట్యాంకర్లతో నీటి సరఫరా చేయడం, నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించడం ద్వారా సమాజానికి ఎల్లవేళలా అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, అనాథ పిల్లల సంక్షేమానికి తమ వంతు సహాయం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవ. డాక్టర్ విశ్వం, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్లయ్య, జి. ప్రభాకరరావు, రెవ. బి. శ్రీనివాస్ పాల్, రెవ. ఇశ్రాల్ రెడ్డి, చిలకబత్తిని కనకయ్య పాల్గొని పల్లా కిరణ్‌ను ఆశీర్వదించారు. వైద్యులు డా. రఘు, డా. సృజన్, డా. రాజు కుమార్, డా. హరికృష్ణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, గంట కిరణ్ మరియు పల్లా కిరణ్ యూత్ సభ్యులు సేవలందించి శిబిరాన్ని విజయవంతం చేశారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దు

## గంగపుత్ర సంఘం తీర్మానం



**ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 04 (జనంసాక్షి)**
బురహన్‌పురం గంగపుత్ర సంఘం నూతన కమిటీ తొలి కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు జీజుల శంకరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామంటూ నాయకులు ఇస్తున్న హామీలను ఖండించారు. ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలకు అన్యాయం జరుగుతుందని, ప్రభుత్వం ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి పెద్దపల్లి సుధాకర్, కోశాధికారి డోలి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు పెద్దపల్లి సోమయ్య, గౌరవ సలహాదారు పాకాల ఉపేందర్, ఉపాధ్యక్షుడు పిల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భద్రతే తొలి వెలుగు..

## దీపావళిపై త్రివేణి విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అవగాహన




**ఖమ్మం, (జనంసాక్షి) :**
దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు పూర్తి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్ ఫైటర్ పి. కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాణసంచా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయనతో పాటు ఫైర్ సిబ్బంది పి. భాస్కర్ రావు, జి. అశోక్, కె. సాయినికేష్ పాల్గొని పలు సూచనలు చేశారు. టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణ ఉండాలని, తగినంత దూరం పాటించాలని, చేతిలో పెట్టుకుని బాణసంచా కాల్చకూడదని, కాటన్ దుస్తులు ధరించాలని, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగితే వెంటనే స్పందించేందుకు నీటి బకెట్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు పండుగలను ఆనందంతో పాటు బాధ్యతాయుతంగా, భద్రతా నియమాలు పాటిస్తూ జరుపుకోవాలని సూచించారు.ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమంలో నేర్చుకున్న భద్రతా సూచనలను తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసి ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థుల్లో అగ్నిప్రమాదాల నివారణ, బాణసంచా భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా సాగిందని పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ పేర్కొన్నారు.

# గిరిజనుల మూలికా వైద్యానికి జాతీయ స్థాయిలో గుర్తింపు

## జాతీయ గిరిజన ఆరోగ్య కేంద్రం వారి సెమినార్‌లో భద్రాచలం ఐటీడీఏ గిరిజన బృందం

**భద్రాచలం నవంబరు 04 (జనంసాక్షి)**
గిరిజనులు తరతరాలుగా అనుసరిస్తున్న మూలికా వైద్య విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. సంప్రదాయ వైద్యాన్ని ప్రోత్సహించడంతోపాటు, గిరిజన వైద్యులను ఆధునిక వైద్య వ్యవస్థలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని 16 మంది గిరిజన బృందం సభ్యులు పాల్గొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఈ బృందం మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని శాంతివనంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సెమినార్‌కు హాజరైంది. గిరిజనులు సేకరించే వనమూలికలు, వాటితో తయారుచేసే ఔషధాలు, సంప్రదాయ వైద్య విధానాల గురించి సెమినార్‌లో పాల్గొన్న ప్రముఖులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో గిరిజన వైద్యులు అందించే మూలికా ఔషధాలు ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సంప్రదాయ వైద్య పరిజ్ఞానాన్ని పరిరక్షించడంతోపాటు, దాని ప్రయోజనాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కృషితో ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయడంతోపాటు, గిరిజన మహిళలు తయారుచేసే ఉత్పత్తులు, రైతులు పండించే సేంద్రియ ఆహార పదార్థాలు, అటవీ ఉత్పత్తుల విక్రయానికి భద్రగిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమాలు గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయని తెలిపారు. వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజన వైద్యులు మూలికలతో లేహ్యాలను తయారుచేసి వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఔషధాలను మరింత నాణ్యంగా, మన్నికగా తయారుచేసే విధానాలపై అవగాహన కల్పించేందుకు సంబంధిత గ్రామాలను సందర్శించి పరీక్షలు నిర్వహిస్తామని సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు తెలిపినట్లు బృందం సభ్యులు వెల్లడించారు.

# పట్టభద్రుల ఓటరు నమోదులో కాంగ్రెస్ శ్రేణుల విస్తృత ప్రచారం

## నవంబర్ 6లోపు నమోదు చేసుకోవాలని అర్హులకు విజ్ఞప్తి



**బూర్గంపహాడ్ నవంబరు 04 (జనంసాక్షి)**
నల్గొండ-వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ శ్రేణులు ముమ్మరం చేశాయి. మండల కేంద్రంలోని పట్టభద్రులైన విద్యార్థులు, ఉద్యోగులను, మైనారిటీ పాఠశాల, ఆశ్రమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు అర్హులైన పట్టభద్రులను కలిసి, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ఫారం?18 ద్వారా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబరు 6లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉండేలా చూసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. ప్రతి పట్టభద్రుడు బాధ్యతగా ఓటరు నమోదులో పాల్గొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వర్ రెడ్డి, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, యువజన నాయకుడు భజన ప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేసుపాక రాజేష్, కాంగ్రెస్ మండల నాయకుడు దాసరి సాంబయ్య, పార్టీ సీనియర్ నాయకుడు షేక్ మహబూబ్ పాషా, బీఎల్ఏలు పుట్టి ప్రసాద్, అలవాల దుర్గాప్రసాద్, మూడో వార్డు సభ్యురాలు కేసుపాక ప్రవళిక, పెరుమాళ్ల రాంబాబు, గుడిసెట్టి నరేష్, ఇసంపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గరిమెళ్లపాడు నర్సరీలో ఎండిపోయిన చెట్లకు వేలం

## ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం నవంబరు 04 (జనంసాక్షి):**
కొత్తగూడెంలోని గరిమెళ్లపాడు నర్సరీలో ఉపయోగంలో లేని, ఎండిపోయిన 52 చెట్లను వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న గరిమెళ్లపాడు ఉద్యానవన కేంద్రంలో వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం ద్వారా చెట్లను కొనుగోలు చేయాలనుకునే వ్యాపారులు నిర్ణీత తేదీన వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో అశోక, సర్వే, కేశవ, చింత, నిమ్మ, నేరేడు తదితర జాతులకు చెందిన చెట్లు ఉన్నట్లు తెలిపారు.



## మురుసు తుపాన్ వరదలను పరిశీలించిన సీఐ,ఎస్ ఐ

*అర్ధాంతరంగా ప్రజలు వాగులు దాటకుండా ముందు జాగ్రత్త చర్యలు*

**పెనుబల్లి,నవంబర్ 4 (జనంసాక్షి)**

తుఫాన్ ప్రభావనీ తో పెనుబల్లి మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని రహదారులపై ప్రవహిస్తున్న వాగులనుబుదవారం సత్తుపల్లి రూరల్ సిఐ సర్వయ్య, వీఎం బంజర్ ఎస్ ఐ షాకీర్ తో కలిసి పరిశీలించారు. గ్రామాలలో రహదారులపై ప్రవహిస్తున్న వాగులను, చెరువు అలుగులను ప్రజలు తొందరపాటుగా దాటవద్దని ముద్దు జాగ్రత్త హెచ్చరికలు జారీ చేశారు, కొత్త కారాయి గూడెం పాత కారాయిగూడెం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న రంగ నాయకుల చెరువు అలుగుకు, టేకులపల్లి తాళ్లపెంట రహదారిపై చీనియ తండా వద్ద ప్రవహిస్తున్న వాగులను ప్రజలు దాటకుండారెండు వైపులా పంచాయితీ ట్రాక్టర్లను అడ్డుగా ఏర్పాటు చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల యూనియన్ రీజనల్ కమిటీ

### నియామకాలు రీజనల్ కమిటీ కార్యదర్శిగా అచ్చ కోటిలింగం



**కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 4 (జనంసాక్షి):** ఇంటెక్ (INTUC) అనుబంధ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (TSEEU 327) 7వ దశ రీజనల్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా రీజనల్ కమిటీ కార్యదర్శిగా అచ్చ కోటిలింగం, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా వలపు యాకయ్య నియమితులయ్యారు.ఈ సందర్భం గా నూతనంగా నియమితులైన నాయకులను సీఈ శివ రాంరెడ్డికి పరిచయం చేయగా, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు వారికి శు భాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్య క్రమం లో ఎం.ఏ. మజీద్, సాదం రామకృష్ణారావు, చిరుతాని సాయిబాబు, జాల కరుణాకర్‌రెడ్డి, దానం నరసింహారావు, ఆర్. అప్పారావు, ఎన్. కోటి, డోలు శ్రీనివాస్, జానీ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సమన్వయ సమావేశం



**కల్లూరు నవంబర్ 04(జనంసాక్షి)** దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రజలందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా పండుగను జరుపుకునేలా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధ్యక్షతన సంబంధిత అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సమావేశంలో దీపావళి పండుగ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, బాణసంచా విక్రయాలకు అనుమతులు, తాత్కాలిక బాణసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటు, అగ్నిప్రమాదాల నివారణ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, అత్యవసర వైద్య సేవలు, విద్యుత్ భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. అదేవిధంగా, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు జరగకుండా పర్యవేక్షించడం, లైసెన్సులు పొందిన వ్యాపారులు నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి దీపావళి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కోరారు.

# ట్రాక్టర్‌ల ఫుల్ వీల్స్ దొంగల అరెస్ట్

- జ్యుడీషియల్ రిమాండ్ కు ఐదుగురు నిందితులు..
- రూ. 6, 50,000 విలువగల ఫుల్ వీల్స్ స్వాధీనం..
- విలేకర్ల సమావేశంలో సిఐ సర్వయ్య వెల్లడి..

**పెనుబల్లి, నవంబర్ 4 (జనంసాక్షి)**



రైతుల పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్ల ఫుల్ వీల్స్ లను దొంగతనాలు చేస్తున్న ఐదుగురు దొంగలను అరెస్టు చేసి,రూ. 6,50,000 ల విలువగల ఫుల్ వీల్స్ లను స్వాధీన పరుచుకున్నట్లు బుధవారం రాత్రి వి ఎం బంజర్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ సర్వయ్య వెల్లడించారు. సీఐ వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం వి ఎం బంజర ఎస్ ఐ ఎస్ కె.షాకీర్, హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రాజమల్లు, జి శ్రీనివాస్ లతో కలిసి పెనుబల్లి మండలం ముత్తగూడెం వైపు పెట్రోలింగ్ చేస్తుడగా గ్రీన్ ఫీల్డ్ హైవే బ్రిడ్జ్ కింద రెండు వాహనాలు వ్యవసాయానికి వాడే సామాగ్రి ని లోడ్ చేసుకొని ఉండగా అనుమానంతో తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలొ ఫుల్ వీల్స్ లను దొంగిలించే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి సామాన్లతో సహా పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని సీఐ తెలియజేశారు. పట్టుబడిన వారిలో పంతంగి చెన్నకేశవ, కుంట రాఘవేంద్ర, మేకల గోవర్ధన్, పుచ్చి ముత్తయ్య.గోపిన నవీన్ వీరు పట్టు పడగా ఎస్కే మస్తాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఐదుగురిని సత్తుపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి జ్యుడీషియల్ డిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐ సర్వయ్య, వీఎం బంజర ఎస్సై షాకీర్, వేంసూర్ ఎస్సై పల్లెల ప్రదీప్ తో పాటు సిబ్బందిని సి పి సునీల్ దత్, కల్లూరు డివిజన్ ఏసిపి వసుంధర యాదవ్ అభినందించారు.



## రాష్ట్ర ఉద్యోగ సంఘాల నేతలకు సన్మానం

### నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో కలిసిన ఖమ్మం జిల్లా సంక్షేమాధికారులు



**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యోగ జేఏసీ, టీఎన్జీవో సంఘం రాష్ట్ర ముఖ్య నేతలను ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ వసతిగృహ అధికారుల వేదిక ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవోల భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ భేటీ జరిగింది. జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవోల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుతో పాటు టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, టీజీవో ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లను ఖమ్మం ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, జిల్లా వేదిక అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఆర్.నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కె ఆర్ ఆర్ అటానమస్ డిగ్రీ కళాశాలకు

## ఎన్ సి సి యూనిట్ మంజూరు

**కోదాడ,( జనం సాక్షి):**

కోదాడ పట్టణంలోని కె ఆర్ ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు 2026-27 విద్యా సంవత్సరంకు ఎన్ సి సి యూనిట్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరదసారాణి బుధవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నలగొండ 31(బి) బెటాలియన్ కింద ఈ ఎన్ సి సి యూని ట్ పనిచేస్తుందని తెలిపారు. ఎన్ సి సి కి మొత్తంగా104 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుం దని అందులో ఈ విద్యా సంవత్సరం 34 మంది మొదటి సంవత్సరం విద్యార్థి లకు అడ్మిషన్ ఉంటుందన్నారు. విద్యార్థినులకు 33% రిజర్వేషన్ ఉంటుం దని తెలిపారు. ఎన్ సి సి చేరే విద్యార్థి లకు ఈనెల 7 శనివారం రోజున ఎంపిక ప్రక్రియ లో భాగంగా 1.2 కిలోమీటర్ల పరుగు పందెం, ఇతర శారీరక ధారుడ్య పరీక్షలు నల్గొండ బెటాలియన్ కమాండెట్, ఔ అ అ కేర్ టేకర్ ఆఫీసర్ టి. రాజు నిర్వహిస్తారని తెలి పారు. అబ్బాయిలకు 5 అడుగుల 6 ఇంచు లు, అమ్మాయిలకు 5 అడుగుల 3 ఇంచుల ఎత్తు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశా లలో ఎన్ సి సి కేర్ టేకర్ ఆఫీసర్ టి రాజును సంప్రదిం చాలని తెలిపారు.

## గురుకుల ఉపాధ్యాయుల డీఏ ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి

### టీఎస్‌యూటీఎఫ్ ఎం.జె.పి. వింగ్ రాష్ట్ర అధ్యక్షులు లివిన్‌స్టన్ డిమాండ్



**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ ఎం.జె.పి. వింగ్ రాష్ట్ర అధ్యక్షులు లివిన్‌స్టన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత కొంతకాలంగా డీఏ ఏరియర్స్ విడుదల కాకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు వారి హక్కని, వాటిని సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ ఆర్థిక అవసరాల దృష్ట్యా ఈ చెల్లింపుల్లో జాప్యం జరగడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం తక్షణమే కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఎలాంటి జాప్యం లేకుండా బీసీ గురుకుల ఉపాధ్యాయుల డీఏ ఏరియర్స్ బకాయిలను విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధన కోసం టీఎస్‌యూటీఎఫ్ ఎం.జె.పి. వింగ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఈ సందర్భంగా లివిన్‌స్టన్ స్పష్టం చేశారు.

# నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

## 45 రోజుల గ్రామాభివృద్ధి ప్రణాళికపై అధికారుల దిశానిర్దేశం

**వలిగొండ, నవంబర్ 4 (జనంసాక్షి)**




రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా గ్రామస్థాయిలోనే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని మండల స్థాయి అధికారులు సూచించారు. వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో 45 రోజుల గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి, తహసీల్దార్ దశరథ నాయక్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించాల్సిన సేవలపై సర్పంచులకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో వివరించగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. 45 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రతినిధులు పాల్గొన్నారు.





## పీఎంశ్రీ చాడ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**మోటకొండూరు, నవంబర్ 4(జనంసాక్షి):**

జిల్లా స్థాయిలో నిర్వహించిన పీఎంశ్రీ పాఠశాలల క్విజ్, సాంస్కృతిక పోటీల్లో మోటకొండూరు మండలం చాడ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కృష్ణవేణి తెలిపారు. డాన్స్ పోటీల్లో 5వ తరగతి విద్యార్థిని పాము సాన్విక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరితో పాటు గుర్రాల షీలాదిత్య, బొట్ల సహజలక్ష్మి వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు ప్రమోదిని విద్యార్థులను వెన్నంటి ఉండి ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

### మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**పి.ఏ.పల్లి, నవంబర్ 4 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ప్రజలు తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని అన్నారు.బుధవారం పి.ఏ.పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బోలిగోర్ల కొండల్‌తో పాటు పలువురు రవీంద్ర కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వార్డు సభ్యులు చల్ల పద్మ అన్వేష్, బోలిగోర్ల రామయ్య, అరవింద్, సాయి, శివ, అఖిల్, గిరి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.



## ఎస్సీ బాలికల గురుకుల కళాశాల తనిఖీ

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి)**

సూర్యాపేట మండలం బాలెంలలో తాత్కాలికంగా కొనసాగుతున్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్‌రూమ్, డైనింగ్‌హాల్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. అలాగే రికార్డులను పరిశీలించి బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

## భూసార పెంపుపై రైతులకు అవగాహన

### వ్యవసాయ అధికారి ధరావత్ సైదా నాయక్



**నూతనకల్ నవంబర్ 4 (జనంసాక్షి)**

నూతనకల్ మండలంలో ఖేత్ బచావో సాగుభూమి సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నూతనకల్ మండలంలోని మిర్యాల రైతు వేదికలో ఖేత్ బచావో?సాగుభూమి సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అక్షిత్ సాయి రైతులకు సాగుభూమి సంరక్షణ, నేల ఆరోగ్యం, భూసార పరిరక్షణ, పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులు, పంట మార్పిడి ప్రాముఖ్యత గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ధీరావత్ సైదానాయక్ మాట్లాడుతూ, రైతులు భూసారాన్ని కాపాడుకుంటూ, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పర్యావరణహితమైన స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పావని,సంధ్య, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్లోరోసిస్ నియంత్రణపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక దృష్టి

- మర్రిగూడలో ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేసిన స్పెషల్ మానిటర్ డాక్టర్ అనివేశ్ భట్టాచార్య
- రక్షిత మంచినీటి సరఫరాతో వచ్చిన మార్పులపై ఆరా.. అధికారులతో సమీక్ష

**మర్రిగూడ, నవంబర్ 4 (జనంసాక్షి)**

నల్గొండ జిల్లాలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక మానిటర్ డాక్టర్ అనివేశ్ భట్టాచార్య పర్యటన రెండో రోజు కొనసాగింది. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా సంస్థల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, తాగునీటి సరఫరా,ఆరోగ్య పరిరక్షణ చర్యలను పరిశీలించారు.

**అంగన్‌వాడీలో తాగునీటి పరిస్థితిపై ఆరా**

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కల్పిస్తున్న తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన స్పెషల్ మానిటర్, నీటి కొరత ఏర్పడినప్పుడు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని ప్రశ్నించారు. రెండు రోజులకు ఒకసారి నీటిని నిల్వ చేసుకుని అవసరాలకు వినియోగిస్తున్నట్లు వారు వివరించారు.

గ్రామంలో గతంలో సీజ్ చేసిన బోరుబావులను పరిశీలించిన ఆయన, ప్రస్తుతం గ్రామ పరిధిలో ఉన్న బోరుబావుల సంఖ్యను గుర్తించి సమగ్ర వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**రికార్డుల నిర్వహణపై పరిశీలన**

గ్రామపంచాయతీ కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన రికార్డులు, వాటర్ లెవెల్ బుక్స్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. నీటి వనరుల వివరాలు, రికార్డుల నిర్వహణ, నమోదు విధానాన్ని పరిశీలించి అధికారుల పనితీరును అభినందించారు.

**ఆరోగ్య సేవలపై సమీక్ష**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శాలినితో మాట్లాడి ఆసుపత్రిలో అంది స్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలికలకు ఐరన్ మాత్రలు, సిరప్‌లు అందిస్తున్నామని, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నా మని వైద్యాధికారి వివరించారు. బీపీ, మధుమేహ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రతి నెలా ఆయా సమస్యలతో బాధపడుతున్న గ్రామస్థులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు.గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారా అని స్పెషల్ మానిటర్ ప్రశ్నించగా, 2024-25 వరకు నిర్వహించిన సర్వేలో ఫ్లోరోసిస్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ శాలిని వెల్లడించారు.

**మిషన్ భగీరథతో వచ్చిన మార్పులపై చర్చ**

గతంలో ఫ్లోరోసిస్ నిర్మూలన కోసం కృషి చేసిన కంచికట్ల సుభాష్‌తో పాటు గ్రామస్థులతో డాక్టర్ అనివేశ్ భట్టాచార్య మాట్లాడారు. గ్రామంలో గతంలో నెలకొన్న ఫ్లోరోసిస్ పరిస్థితులు, మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచినీటి సరఫరా ప్రారంభమైన తర్వాత వచ్చిన మార్పులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామస్థుల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకున్న ఆయన, రక్షిత తాగునీటి సరఫరా ఫ్లోరోసిస్ నియంత్రణలో చూపుతున్న ప్రభావాన్ని పరిశీలించారు. గ్రామంలో నీటి వనరుల పరిస్థితి, ప్రజలకు అందుతున్న మంచినీటి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ అజయ్ కుమార్, ప్రయోగశాల ఇన్‌చార్జి వీరారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శాలిని, సర్పంచ్ నరసింహ, ఉపసర్పంచ్ సైదులు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### జాజిరెడ్డిగూడెంలోని ఎస్ బీ ఐని వేరే ప్రాంతానికి

## తరలించవద్దని ధర్నా, నిరసన

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి)**

జాజిరెడ్డిగూడెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్ బీ ఐ )ని వేరే ప్రాంతానికి మార్చే యోచనను బ్యాంక్ అధికారులు విరమించుకొని యథావిధిగా అక్కడే కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం బ్యాంక్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 1985 నుంచి జాజిరెడ్డిగూడెంలో ఎస్బీ ఐ సేవలందిస్తుందని తెలిపారు. ఈ శాఖను వేరే ప్రాంతానికి తరలిస్తే తమకు ఇబ్బందులు అవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్‌కు బ్యాంక్‌ను తరలించవద్దని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్

## తూప్రాన్‌పేట స్కూల్‌ను సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు



**చౌటుప్పల్, నవంబర్ 4(జనంసాక్షి)**
మండలం లోని తూప్రాన్‌పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ డిమాండ్ చేసింది. బుధవారం ఎస్ఎఫ్ ఐ తూప్రాన్‌పేట గ్రామ శాఖ ఆధ్వర్యం లో నాయకులు పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా నాయకులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత, మెనూ అమలు తీరును పరిశీలించడంతో పాటు పాఠశాల లోని మౌలిక వసతుల గురించి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తూప్రాన్‌పేట గ్రామ శాఖ కార్యదర్శి లవణం సాత్విక్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గి పోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణ కూడా సక్రమంగా సాగడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లి దండ్రులకు నమ్మకం కలిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి అనుకూలంగా తగిన ఆటస్థలాన్ని (ప్లే గ్రౌండ్) కేటాయించాలి. అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు తగిన సంఖ్యలో ఉన్నప్పటికీ, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం ప్రభుత్వ విద్యావ్యవస్థలో నెలకొన్న దయనీయ స్థితికి అద్దం పడుతుందని సాత్విక్ విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి, విద్యావ్యవస్థ బలోపేతానికి భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ నాయకులు రాజు, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**సూర్యాపేట (జనంసాక్షి):**
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీలోని 45వ వార్డు విద్యా నగర్ లో ఐదు లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో రెండు విడతలలో 1000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇందుకు సహకరించిన జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకతీతంగా అన్ని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో దాదాపు 3500 మంది పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన అందరికి పెన్షన్ ఇస్తామని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని, పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ మాట్లాడుతూ తమ వార్డులో ఏ సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తున్నారని, తమకు సహకరిస్తున్న చైర్ పర్సన్ కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, సవరాల సత్యనారాయణ, నరేంద్రుని హరీష్, వెంపటి మనోహర్, మున్సిపల్ డిఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, జవాను కొండేటి వెంకన్న, వార్డు ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చదువు మానేసిన పిల్లలను గుర్తించి

# తిరిగి బడిలో చేర్పించాలి

### పిల్లలను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, నవంబర్ 4,(జనంసాక్షి):**
జిల్లాలో వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్‌తో కలిసి బాలల సంరక్షణ, బలోపేతంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలలకు హాజరుకాని విద్యార్థులను గ్రామాల వారీగా గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు.బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువుకు దూరమైన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి ప్రవేశం కల్పించాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ప్రమాదకర వృత్తుల్లో, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారికి రక్షణ, పునరావాసం, విద్యతో పాటు అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా సరైన దిశలో నడిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దారి తప్పుతున్న పిల్లలను గుర్తించి, వారికి తగిన సూచనలు, పునరావాసం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లావణ్య, డీఈఓ సుసింధర్ రావు, డీఐఈఓ దస్రు నాయక్, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీవైఎస్ఓ అక్బర్ అలీ, ఆర్‌సీఓలు, డీసీఓ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ అసత్య ఆరోపణలపై

## హాలియా మున్సిపాలిటీ పాలకవర్గం భారీ నిరసన

**హాలియా జనంసాక్షి**
బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ఆరోపణలకు నిరసనగా హాలియా మున్సిపాలిటీ పాలకవర్గం, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఎమ్మెల్యే నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు మున్సిపాలిటీలో రోడ్లు డ్రైనేజీ అనేక వార్డులలో అభివృద్ధి వేగవంతంగా అమలవుతున్నాయని అన్నారు టిఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని త్రీ వంగ విమర్శించారు .కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ మార్కెట్ చైర్మన్ నారాయణ గౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, 3వ వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకట్ రెడ్డి, హాలియా టౌన్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్ పాల్గొన్నారు.అలాగే వార్డు కౌన్సిలర్లు నకరికంటి అన్నపూర్ణ సైదులు (2వ వార్డు), చిట్టిపోలు శ్రీదేవి కరుణాసాగర్ (5వ వార్డు), బొంగరాల యేసురాజు (6వ వార్డు), చింతల చంద్రారెడ్డి (7వ వార్డు), గౌహర్ జబీన్ మజార్ మోహినీద్దీన్ (8వ వార్డు), చెరుపల్లి ముత్యాలు (9వ వార్డు), పిల్లి చంద్రకళ ఆంజనేయులు (10వ వార్డు), దీపావత్ ప్రసాద్ (11వ వార్డు), ఎడవల్లి మేరీ రంజిత్ (12వ వార్డు) తదితరులు పాల్గొన్నారు.

## నగదు బ్యాగును తిరిగి ఇచ్చిన ఆటోడ్రైవర్ రాము

### నిజాయితీని అభినందించిన పట్టణ ఎస్ఐ నరేష్



**హుజూర్‌నగర్, నవంబర్ 3 (జనంసాక్షి):**
ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన రూ.7 వేల నగదు బ్యాగును తిరిగి అందజేసి ఆటోడ్రైవర్ కొళ్లూరి రాము నిజాయితీ చాటుకున్నాడు.చింతలపాలెం మండలం తమ్మారం గ్రామానికి చెందిన కేతిరెడ్డి అఖిల మంగళవారం హుజూర్‌నగర్‌లోని పాత బస్టాండ్ వద్ద రాము ఆటోలో ప్రయాణిస్తూ నగదు బ్యాగును మర్చిపోయింది. ఈ విషయాన్ని గమనించిన రాము బ్యాగును పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. అదే సమయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అఖిల తండ్రి రాంబాబురెడ్డికి ఎస్ఐ నరేష్ సమక్షంలో బ్యాగును అందజేశారు.రాము నిజాయితీని అభినందించిన ఎస్ఐ నరేష్ ఆయనను శాలువాతో సన్మానించారు.

# టీడీపీ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు గోసుకొండ వెంకటేష్



**చౌటుప్పల్, నవంబర్ 4 (జనంసాక్షి):**
చంద్రబాబు నాయుడును విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు గోసుకొండ వెంకటేష్ అన్నారు. చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు చంద్రబాబుపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి చేసేందుకు చంద్రబాబు హయాంలో ఏఎంఆర్పీ, డిండి ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు అందించే శివన్నగూడెం, చర్లగూడెం ప్రాజెక్టులను తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గతంలో నిర్మించిన వాటర్ ట్యాంకులకు రంగులు వేసి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పేర్లతో ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని వెంకటేష్ డిమాండ్ చేశారు.

# విదేశీ పౌరులకు వసతి కల్పిస్తే ఫార్మ్- III నమోదు తప్పనిసరి

### నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు: ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ, నవంబర్ 4 (జనంసాక్షి):**
విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ ఇళ్ల యజమానులు తప్పనిసరిగా ఫార్మ్-ఎఎఎ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.విదేశీ అతిథులు వచ్చిన 24 గంటల్లోగా వారి రాకపోకల వివరాలను indianfrro.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేసిన రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచాలని పేర్కొన్నారు.చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, వీసా లేకుండా విదేశీయులకు వసతి కల్పించడం, వివరాలను సకాలంలో నమోదు చేయకపోవడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ సహా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విదేశీ పౌరులు సైతం వీసా నిబంధనలు పాటించాలని, వసతి కల్పించే యజమానులు ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ కోరారు.